నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, మంగళవారం 19 నవంబర్ 2024 | JANAGAON

మహిళలకు ఇచ్చిన హామీలేమైనయ్?

హనుమకొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి, ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, చల్లా, గండ్ర, శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్

అబద్ధపు హామీలతో వారిని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

హనుమకొండ, నవంబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలేమయ్యాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహిళలను మోసం చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు మహిళలకు రూ. 2500లు, తులం బంగారం, స్కూటీలు ఇచ్చావా... దేనికి విజయోత్సవ సభ పెడుతున్నాడో రేవంత్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. గత సీఎం కేసీఆర్ పాలనలో శంకుస్థాపనలు చేసిన పనులను తామే చేశామంటూ సిగ్గులేకుండా ప్రారంభిస్తున్నారని విమర్శించారు. మహిళా సంఘాలకు రూ. 90వేల కోట్ల రుణాలు అందజేసి నంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే కోటీశ్వరులైన మహిళలను సభలో సన్మానించాలని డిమాండ్ చేశారు.

గతంలో కాంగ్రెస్ పాలనలో రైతు ఎంత గోసపడి ఎట్లా ఉండేటోళ్లు?, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఇప్పుడు మళ్లీ ఎంత ఇబ్బందులు పడుతున్నారో వారిని అడిగితే తెలుస్తుందన్నారు. అప్పుడు ప్రతి వడ్ల గింజనూ కొనుగోలు చేస్తే, ఇప్పుడు రోడ్లపై, కల్లాల్లో ధాన్యం ఉండిపోయిందన్నారు. సభలో ప్రతి జిల్లాకో మహిళా సమాఖ్య భవనమని వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తున్న డబ్బులు ప్రభుత్వానివి కాదని, సంఘాలు సంపాదించిన డబ్బులతో అన్నీ చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలోనే వాళ్లు స్వశక్తితో భూములు కొనుగోలు చేశారని అన్నారు.

ఏం సాధించారని విజయోత్సవ సభ : - ఎమ్మెల్సీ పోచంపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి ఏం సాధించారని విజయోత్సవ సభ నిర్వహిస్తున్నారో చెప్పాలి. ఏడాది కాలంలో 600 మందికి పైగా రైతులు చనిపోయినందుకా?, 130 మంది మహిళలపై అత్యాచారాలు జరిగినందుకా?, 87 మంది ఆటోడ్రైవర్లు, 26 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా?, రైతుబంధు రాక, రుణమాఫీ కాక, రైతుబీమా అందక, బోనస్ ఎగ్గొట్టినందుకా?, తులం బంగారం ఇవ్వనందుకా?, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను గోస పెడుతున్నందుకా?, మూసీ బాధితుల ఇండ్లు కూలగొట్టినందుకా?, హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాలను రోడ్డుపై పడేసినందుకా?, ఉద్యోగులకు 5 డీఏలు ఇవ్వనందుకా?, అల్లుడి కోసం భూములు ఇవ్వని లగచర్ల గ్రామస్తులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలులో పెట్టినందుకా?.. ఇలా ఏమి చేశారని విజయోత్సవ సభ నిర్వహిస్తున్నారు. వరంగల్‌ను హెల్త్ సెంటర్‌ను చేయాలనే సంకల్పంతో కేసీఆర్ రూ. 1500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించి 80 శాతం పూర్తి చేయగా, మిగిలిన పనులను ఎందుకు పూర్తి చేయడం లేదు?. మార్చి వరకు గడువు ఇస్తున్నాం. అప్పటి వరకు పూర్తి చేయకపోతే మేమేంటో చూపిస్తాం. ప్రతి నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి ఏమైంది?. రూ. 30కోట్లతో భద్రకాళి మాడవీధులు నిర్మాణం చేపడితే ఇప్పటి వరకు రూ. 8కోట్లకే టెండర్లు పూర్తి చేశారు. మంత్రుల నియోజక వర్గానికి ఒక ఎమ్మెల్యే పోడు.. ఎమ్మెల్యేల నియోజకవర్గానికి మంత్రులు పోయే పరిస్థితి లేదు. రేపటి సభలో మహిళలకు మీరు ఏమి చేశారో నిలదీసేందుకు వారు సిద్ధంగా ఉన్నారు.

సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సంగం రెడ్డి సుందర్‌రాజు యాదవ్, వాసుదేవా రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బీరెల్లి భరత్ కుమార్‌రెడ్డి, నయీముద్దీన్, బండి రజిని, పోలపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే మహిళా సంఘాల అభివృద్ధి

- అప్పుడు ప్రతి వడ్ల గింజా కొనుగోలు
- నేడు రోడ్లపై, కల్లాల్లోనే ధాన్యం
- విజయోత్సవ సభ ఎందుకో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- ఎమ్మెల్సీ పోచంపల్లి, ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశం

కాళోజీ ఆత్మ ఘోషిస్తుంది - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం

గతంలో పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి 300 గజాల స్థలం ఇవ్వలేదు. ఇప్పుడు మేము చేశామనడం సిగ్గుచేటు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో 4ఎకరాల విస్తీర్ణంలో రూ.75 కోట్లతో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణం చేపట్టి 95 శాతం పనులు పూర్తి చేశాం. వివిధ కారణాలతో పనులు ఆగిపోగా ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తామే నిర్మాణం చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నది. కొత్తవి చేసే చేవ లేక పూర్తి కావచ్చిన వాటిని వారి ఖాతాలో వేసేందుకు నాటకాలు ఆడుతున్నది. తెలంగాణవాదులపై తుపాకులు ఎక్కుపెట్టిన వారు కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తుంటే కాళోజీ ఆత్మ ఘోషిస్తుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బూటకపు ఎన్‌కౌంటర్లపై కాళోజీ గళం విప్పారు. ఆయన బతికి ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు పెట్టారు. మరణించిన తర్వాత గుర్తింపు ఇవ్వలేదు.


ఆర్ట్స్ కాలేజీలో సభ ఏర్పాట్లు

నేడు హనుమకొండకు ముఖ్యమంత్రి

- ప్రజాపాలన విజయోత్సవ సభకు హాజరుకానున్న రేవంత్‌రెడ్డి
- ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి
- కాళోజీ కళాక్షేత్రం సహా పలు పనులకు ప్రారంభోత్సవం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండకు రానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాటుచేసిన సభకు ఆయన హాజరుకానున్నారు. అలాగే కాళోజీ కళాక్షేత్రం సహా పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అలాగే వరంగల్-కరీంనగర్ రహదారిపై నయీంనగర్ వద్ద ఉన్న ప్రధాన రహదారిపై పూర్తయిన వంతెన నిర్మాణాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పాలనలో మొదటి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ సభ నిర్వహిస్తుండగా ప్రాంగణానికి ఇందిరా మహిళాశక్తి ప్రాంగణంగా నామకరణం చేశారు. ఆర్ట్స్ కాలేజీ మైదానంలో సభ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. రెవెన్యూకాలనీ నుంచి గ్రౌండ్‌లోకి వచ్చేందుకు అడ్డుగా ఉన్న చెట్లను, విద్యుత్ స్తంభాలను తొలగించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మైదానంలోకి వచ్చేందుకు అడ్డుగా ఉన్న ప్రహరీలను కూల్చివేశారు.

వేదిక వెనుక వైపు నుంచి వచ్చేందుకు మూడు మార్గాల ద్వారా గోడలను తొలగించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే సభకు పెద్ద సంఖ్యలో మహిళలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీఎం పర్యటన నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద ఏర్పాట్లను పర్యవేక్షించారు. రూట్‌మ్యాప్, వేదిక ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

టార్గెట్లు పెట్టి మరీ..!

- జన సమీకరణ కోసం అధికారులపై ఒత్తిడి
- ఎస్‌హెచ్‌జీ మహిళలు విధిగా రావాలని ఆదేశాలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 18 : ప్రజాపాలన విజయోత్సవ సభ కోసం ప్రభుత్వ అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ జన సమీకరణ చేయిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు విజయోత్సవాల్లో భాగంగా ఇందిర మహిళా శక్తి పేరిట నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం బహిరంగ సభ నిర్వహిస్తున్నది. అయితే మహిళలను సమీకరించే బాధ్యతను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల(డీఆర్డీవో)కు బాధ్యతలను అప్పగించింది. ఎంపీడీవోలు, వీవోలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని ప్రతి మహిళను వరంగల్ మీటింగ్‌కు రావాలని ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తెస్తున్నారు. వరంగల్ బహిరంగ సభ జన సమీకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 900 ఆర్టీసీ బస్సులను వాడుకుంటున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోనే 150 బస్సులను కేటాయించింది. దీనికి తోడు ఇతర వాహనాల్లో సాధారణ జనాన్ని తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా జరుగుతున్న వరంగల్ బహిరంగ సభ కోసం అధికార ఒత్తిడి తేవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు హనుమకొండ జిల్లా పర్యటనకు రానున్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్

- **మధ్యాహ్నం 2.30 గంటలకు :** హెలికాప్టర్‌లో హనుమకొండలోని కుడా గ్రౌండ్‌కు చేరుకుంటారు.
- **2.30 నుంచి 3.10 :** కాళోజీ కళాక్షేత్రం ప్రారంభిస్తారు. ఆర్ట్ గ్యాలరీని తిలకిస్తారు.
- **3.10 నుంచి 3.20 :** కుడా గ్రౌండ్ నుంచి ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు.
- **3.20 నుంచి 3.50 :** ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన మహిళా సంఘాల స్టాళ్లను సందర్శించి, మహిళలతో మాట్లాడుతారు.
- **3.50 నుంచి 3.55 :** ఇందిర మహిళా శక్తి సభ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.
- **3.55 నుంచి 4.00 :** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వాగతోపన్యాసం.
- **4.00 నుంచి 4.20 :** మంత్రుల ప్రసంగాలు
- **4.20 నుంచి 4.30 :** 22 ఇందిరా మహిళా శక్తి భవనాలకు, ట్రాన్స్‌జెండర్ల క్లినిక్స్‌కు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన. బ్యాంకు లింకేజీ, బీమా చెక్కుల పంపిణీ. టీజీఆర్టీసీ-డిస్కంలతో ఎంవోయూ.
- **4.30 నుంచి 4.40 :** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగం
- **4.40 నుంచి 5.00 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగం.
- **5 గంటలకు :** హనుమకొండ కలెక్టర్ వందన సమర్పణ.

నగరం దిగ్బంధం

- సీఎం పర్యటనపై డేగకళ్లతో పోలీస్ నిఘా
- బందోబస్తులో 1500 మంది విధులు
- రాష్ట్ర నలుమూల నుంచి పోలీసులు
- లగచర్ల ఘటనతో ముందస్తు జాగ్రత్తలు
- గిరిజన, ప్రజా సంఘాలపై ఫోకస్
- బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులు

సుబేదారి, నవంబర్ 18 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన నేపథ్యంలో నగరంలో ఎప్పుడూ లేని విధంగా పోలీసు బలగాలు మోహరించాయి. లగచర్ల సంఘటనతో పోలీసు ఉన్నత అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకొని రాష్ట్ర నలమూలల నుంచి పెద్ద సంఖ్యలో బందోబస్తుకు పంపినట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే రేవంత్ సర్కారుపై రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం.. ఇదే సమయంలో ఉద్యమాల ఖిల్లా ఓరుగల్లుకు ముఖ్యమంత్రి రానుండడంతో పర్యటనపై ఎక్కడ ప్రభావం పడుతుందోననే ఉద్దేశంతో పోలీసు శాఖ అలర్ట్ అయింది. ఇందులో భాగంగా సీఎం పర్యటనలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తుగా భద్రతను కట్టుదిట్టం చేశారు. రెండు రోజుల ముందునుంచే ఇంటెలిజెన్స్ బృందాలు నగరంలో మకాం వేశాయి. లగచర్ల సంఘటన ప్రభావం ఉంటుందా? అనే కోణాల్లో ఆరా తీసి స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు రెండు రోజులుగా గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల నాయకులపై నిఘా పోకస్ పెట్టారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులను మంగళవారం తెల్లవారుజామునే హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం పర్యటన కొనసాగే హనుమకొండ బాలసముద్రం కాళోజీ కళాక్షేత్రం, సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం సభా ప్రాంగణం, సీఎం కాన్వాయ్ ప్రయాణించే రూట్లలో పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. పర్యటనకు ఒక రోజు ముందుగానే పలువురు రాష్ట్రస్థాయి ఐపీఎస్ అధికారులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధుల్లో వరంగల్ పోలీసు కమిషనరేట్‌తో పాటు రాష్ట్రం నలుమూల నుంచి 1500 మంది విధులు నిర్వర్తించనున్నట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సన్నాహాలు?

- హద్దులు నిర్ణయించాలని రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలు
- వివరాలను రైల్వే శాఖకు పంపనున్న స్థానిక అధికారులు

కాజీపేట, నవంబర్ 18 : ఉత్తర, దక్షిణ భారతదేశానికి ముఖద్వారంగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌కు డివిజన్ హోదా కల్పించేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సికింద్రాబాద్ ఉన్నతాధికారులకు కాజీపేట డివిజన్ ఏర్పాటుకు హద్దులు, సరిహద్దుల గురించి ఆరా తీసినట్లు రైల్వే కార్మికులు చెప్పారు. త్వరలోనే కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా గుర్తింపు రానున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద రైల్వే స్టేషన్ అయిన కాజీపేట సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు అధిక మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుతున్నది. కొత్తగా కాజీపేట డివిజన్ ఏర్పాటైతే,..కాజీపేట - బల్లార్షా సెక్షన్‌లో మాణిక్‌ఘర్, ఎల్ఎన్‌టీ సైడింగ్, పండర్‌పాణి, పెద్దపల్లి నుంచి కరీంనగర్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపం వరకు, కాజీపేట -విజయవాడ సెక్షన్‌లో కొండపల్లి, డోర్నకల్ నుంచి మణుగూరు, డోర్నకల్ నుంచి గద్వాల్ వరకు, మణుగూరు నుంచి రామగుండం వరకు నూతనంగా ఏర్పాటు కానున్న రైల్వే ట్రాక్ ప్రాంతమంతా దీని పరిధిలోకి వస్తుందని రైల్వే కార్మిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కాజీపేటలో రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ షెడ్డు, వందేభారత్ కోచ్‌ల తయారీ ఫ్యాక్టరీ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కాజీపేట రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందితే ముఖ్య కార్యాలయాల ఏర్పాటుతో పాటు వివిధ ప్రాంతాలకు నూతన రైళ్లు నడువనున్నాయి. మరిన్ని రైల్వే పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్ - మాజీ ఎమ్మెల్యే గండ్ర

కాళేశ్వరం వల్లనే ఈ రోజు వ్యవసాయ రంగానికి గుర్తింపు వచ్చింది. అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసి చూపించిన మహనీయుడు కేసీఆర్. సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కాళేశ్వరం ప్రాజెక్టులో వచ్చిన చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి కాంగ్రెస్ చూపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలి రెవెన్యూ తగ్గింది. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్‌లో బంధుప్రీతి పెరిగింది. అనాలోచిత విధానాలకు తెరదించి, కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా న్యాయమైన పాలనపై దృష్టి పెట్టాలి.

విజయోత్సవ సభ కాదు.. వైఫల్యాల సభ - ఎమ్మెల్యే పల్లా

విజయోత్సవ సభకు రైతులు వచ్చే పరిస్థితుల్లో లేనందున మహిళలతో కార్యక్రమం చేయిస్తున్నారు. మహిళా సంఘాల డబ్బులతోనే వారిని తరలించేందుకు డీఆర్డీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రైతు డిక్లరేషన్‌లో చెప్పినట్లు రూ. 2 లక్షల రుణమాఫీ, వరికి రూ. 500 బోనస్, పంటల బీమా, రైతు భరోసా ఏ ఒక్కటి కూడా అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలి. కేవలం 40% మందికే రుణమాఫీ అయ్యింది. ఇంకా రూ. 15 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉంది. వరి ఉత్పత్తి, విస్తీర్ణంలో దేశంలోనే మొదటి స్థానంలోకి రాష్ట్రాన్ని తీసుకొచ్చాం. కాళేశ్వరం లేకుండానే పంటలు పండాయా..? బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రంలో జలకళ సంతరించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 85 లక్షల వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ఇప్పటి వరకు 10 లక్షల మెట్రిక్ టన్నులు కూడా సేకరించలేదు. గురుకులాల్లో ఈ సంవత్సరం 2లక్షల అడ్మిషన్లు తగ్గినందుకు సీఎంగా రేవంత్‌రెడ్డి సిగ్గు పడాలి. ఈ జిల్లాలోని మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి వారే పందికొక్కుల్లా దోచుకుంటున్నారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుపాకి రాముడు, పిట్టల దొర.. నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు గురించి మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి వాళ్ల కాలి గోటికి కూడా సరిపోడు. బిడ్డా.. నీవు ఖమ్మంలో చేసిన అవినీతి, భూముల ఆక్రమణలు, దొంగ బిల్లుల డ్రాను బయటకు తీసి నీ సంగతి చూస్తాం. తెలంగాణ సంపదను హెలికాప్టర్లు వేసుకొని పోయి రాహుల్ గాంధీకి దోచిపెడుతున్నారు.

ఎస్సీలకు రేవంత్‌రెడ్డి చేసింది శూన్యం - మాజీ ఎమ్మెల్యే తాటికొండ

కాంగ్రెస్ పాలనలో ఎస్సీలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిందేమీ లేదు. మంత్రి వర్గంలో సామాజిక న్యాయమేది?, 2 ఎంపీలు కూడా మాలలకే ఇచ్చారు. విదేశాల్లో చదివే పిల్లలకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ రావడం లేదు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి బైండ్ల అని, ఎస్సీ అని, బీసీ అని చెప్పుకున్నడు. ఈ కులగణనలో ఏ కులం రాపిస్తాడో చూడాలి. కడియం దియా నజీర్ అని తన మనుమరాలు పేరు పెట్టుకొని రాజకీయ వారసత్వాన్ని ప్రకటించాడు. బీఆర్ఎస్‌లో అన్ని పదవులు అనుభవించిన శ్రీహరి పార్టీని మోసం చేశాడు. బీఆర్ఎస్ పార్టీ ఫండ్ తీసుకున్న తర్వాత పార్టీ మారాడు. బీఆర్ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలవాలి.

గిరిజనులకు అండగా కేసీఆర్ - మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ గిరిజనులకు అండగా నిలిచారు. తండాలను గ్రామ పంచాయతీలుగా, రిజర్వేషన్‌తో పాటు పోడు రైతులకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే. సీఎం రేవంత్ రెడ్డి మాటలు చూస్తుంటే ఆయన లేబరా.. గూండానా, రౌడీనా అర్థం కావడం లేదు. లగచర్లలో తుపాకులతో మా లాంబాడీలను బెదిరిస్తున్నారు. మేము తుపాకులకు బెదిరే వాళ్లం కాదు. అడవిలో పుట్టి అడవిలో పెరిగాం. ఓరుగల్లు గడ్డ మీద కాలు పెట్టే ముందు లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి. రేపటి సభకు మేం ఏ వేషంలో ఎక్కడికి వస్తామో చూసుకో బిడ్డా రేవంత్ రెడ్డి?

బీఆర్ఎస్ హయాంలోనే మెగా టెక్స్‌టైల్ పార్కు : చల్లా

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చొరవతోనే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశాం. వస్త్ర పరిశ్రమ ఏర్పాటుతో దాదాపు లక్షాయాభై వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. గతంలోనే 1350 ఎకరాల భూసేకరణ చేశాం. లగచర్ల భూసేకరణలో రాద్ధాంతం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులపై కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నాడు. మా ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఉద్యోగాలకు పత్రాలు మీరిచ్చారు. సంవత్సర కాలంగా మెగా టెక్స్టైల్ పార్క్‌కు ఒక్క కంపెనీ కూడా తీసుకరాలేక పోయారు. వస్త్ర పరిశ్రమలో నూతనంగా ఏర్పాటైన కంపెనీలు ఎందుకు ప్రారంభం కావడం లేదో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలి. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందని సంబురాలు జరుపుతారు. రేపు జరగబోయే సభలో సీఎం రేవంత్ రెడ్డిని మహిళా రైతులు నిలదీస్తారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితులు లేవు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ జీతాలివ్వని పరిస్థితి - మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంది. ఆర్వీలకు సైతం జీతాలు ఇవ్వలేని దరిద్రం. చేనేత బీమా, వరంగల్ బస్టాండ్ గురించి అడగలేని చేత కాని మంత్రి వరంగల్‌లో ఉన్నారు. ఎంఎన్ నగర్, సంతోషి మాత గుడి దగ్గరి ప్రజలకు గత ప్రభుత్వం పట్టాలు ఇస్తే ఈ ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. మాస్టర్ ప్లాన్ సంవత్సరం క్రితం నుంచే నగరంలో అమలుతున్నది. ఎయిర్ పోర్ట్ విషయంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే ముందుకు సాగింది. రాబోయే మున్సిపల్,గ్రామపంచాయతీ ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో కాళోజీ కళాక్షేత్రానికి 300 గజాల స్థలం ఇవ్వలేదు - మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హనుమకొండ, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాళోజీ కళా క్షేత్రానికి 300 గజాల స్థలం కావాలని కాళోజీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కాళోజీ మిత్ర బృందం అడిగితే తిరస్కరించారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మాజీ సీఎం కేసీఆర్ కాళోజీ కళాక్షేత్రానికి వరంగల్ నగర నడిబొడ్డున హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో స్థలం కేటాయించి అన్ని హంగులతో నిర్మాణం పూర్తిచేశారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రానికి స్థలం తిరస్కరించినా కేసీఆర్ హయాంలో కేటాయించారన్నారు. 300 గజాల స్థలం ఇవ్వని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కాళోజీ కళాక్షేత్రాన్ని చూసి ఏం సమాధానం చెపుతారని వినోద్‌కుమార్ ఆ ప్రకటనలో ప్రశ్నించారు.

లగచర్ల రైతులకు బీఆర్ఎస్ అండ

- రేపు మానుకోటలో కేటీఆర్ ఆధ్వర్యంలో గిరిజన రైతులతో ధర్నా
- ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు

మహబూబాబాద్‌లో ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 18 : లగచర్ల రైతులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని..